నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | గురువారం 22 ఫిబ్రవరి 2024 | MAHABUBABAD


## వనమంతా జనప్రభంజనం

సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు ప్రతిమలను గద్దెలపైకి వచ్చిన సందర్భంలో మేడారం, కన్నెపల్లి, రెడ్డిగూడెం, జంపన్నవాగు, నార్లాపూర్ పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తుల పుణ్య స్నానాలతో జంపన్నవాగు మొత్తం జనంతో నిండిపోయింది. సారలమ్మ గద్దెపైకి రాగానే భక్తులు పరవశంతో దర్శనం కోసం ఒక్కసారిగా గద్దెల వద్దకు వచ్చేందుకు ప్రయత్నించారు. మూడు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన క్యూలైన్లు సరిపోక రోడ్డుపై సైతం వరుసల్లో బారులు తీరారు. అంతకుముందు తల్లుల గద్దెలకు పూజారులు అలుకుపూతలు చేశారు. కాక వంశీయులు సారలమ్మ గుడి నుంచి, మేడారంలోని సమ్మక్క పూజా మందిరం నుంచి పూజారులు వారి కుటుంబ ఆడబిడ్డలు పసుపు, కుంకుమలు, పూజా సామగ్రినితో డోలి వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని అలుకుపూతల కార్యక్రమం నిర్వహించారు.


విద్యుత్ వెలుగుల నడుమ భక్తజనంతో కళకళలాడుతున్న మేడారం గద్దెల ప్రాంగణం




సారలమ్మను జంపన్న వాగు మీదుగా మేడారం గద్దెల వద్దకు తీసుకెళ్తున్న పూజారులు


సారలమ్మను గద్దెపైకి తీసుకువస్తున్న పూజారులు


సారలమ్మ ఆగమనాన్ని తిలకించేందుకు చెట్టెక్కిన భక్తులు


కొండాయి నుంచి గద్దెకు వస్తున్న గోవిందరాజులు

కన్నెపల్లి నుంచి వెన్నెల వెలుగుల్లో సారలమ్మ కదిలివచ్చింది.. వనంలో ఘనమైన మొక్కులందుకోను మేడారం గద్దెపై బుధవారం అర్ధరాత్రి కొలువుదీరింది. దారిపొడవునా భక్త జనం జాబిలమ్మకు ప్రణమిల్లింది. కరుణించాలని.. కడుపుపండాలని ఆడబిడ్డలు తడిబట్టలతో వరం పట్టగా.. తన్మయత్వంతో వేలాది మంది సాష్టాంగపడగా వారందరినీ దీవిస్తూ.. జంపన్నను పలుకరిస్తూ కల్పవల్లి తరలివచ్చింది. ఆద్యంతం శివసత్తులు పూనకాలతో శివవాలూగారు. కోరిన కోర్కెలు తీర్చాలని.. కష్టాలు కడతేర్చాలని భక్తులు మొక్కులు ముట్టజెప్పారు. నేడు చిలుకలగుట్ట నుంచి తల్లి సమ్మక్క రాక కోసం తనువెల్లా కనులు చేసుకొని ఎదురుచూస్తున్నారు.

- తాడ్వాయి, ఫిబ్రవరి 21

# కొలువుదీరిన కల్పవల్లి

**పులకించిన భక్తకోటి**

## వెన్నెల వెలుగుల్లో సారలమ్మ రాక..

- జంపన్నను పలుకరించి.. మేడారం గద్దెపైకి..
- వరం పట్టిన ఆడబిడ్డలు
- వేలాది భక్తుల సాష్టాంగ నమస్కారాలు
- అర్ధరాత్రి కొలువైన జాబిలమ్మకు ఘనంగా మొక్కులు
- గద్దెనెక్కిన పగిడిద్దరాజు, గోవిందరాజులు
- సంపెంగ వాగులో భక్తజన ప్రవాహం
- నేడు సమ్మక్క ఆగమనం

వరాల వన దేవత సారలమ్మ బుధవారం మేడారం గద్దెపై కొలువుదీరింది. పగిడిద్దరాజు, గోవిందరాజులు సారలమ్మతోనే గద్దెలపైకి చేరారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం వడ్డెలు(పూజారులు) పూజలు చేశారు. సాయంత్రం గుడి నుంచి మొంటె (వెదురు బుట్ట)లో అమ్మ వారి ప్రతిరూపమైన పసుపు, కుంకుమలు తీసుకుని మేడారానికి బయలుదేరారు. జంపన్నవాగులోంచి సమ్మక్క గుడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పగిడిద్దరాజు, గోవిందరాజులుతో కలిసి వడ్డెలు ముగ్గురి రూపాలను రాత్రి12.12గంటలకు మేడారం గద్దెలపై చేర్చారు. కన్నెపల్లి నుంచి మూడు కిలో మీటర్ల దూరంలోని మేడారం గద్దెల వద్దకు సారలమ్మ వస్తున్న వేడుకను చూసేందుకు లక్షలాది మంది భక్తులు పోటీపడ్డారు. పూజారి దేవతను తీసుకొస్తున్న సమయంలో సంతానభాగ్యం కలుగాలని, కోర్కెలు నెరవేరాలని గుడి ముందు మహిళలు నేలపై పడుకోగా సారలమ్మను తీసుకువచ్చే ప్రధాన పూజారి కాక సారయ్య వారిని తొక్కుకుంటూ వెళ్లారు. అమ్మవారి ప్రతిమను వెదురు బుట్టలో తీసుకొస్తుండగా ఆలయం మెట్ల నుంచి వంద మీటర్ల పొడవునా భక్తులు కింద పడుకొని వరం పట్టారు. పూజారులు వీరిపై నుంచి దాటి వెళ్లారు. సారలమ్మ రాకను సూచిస్తూ ఆదివాసీ పూజారులు కొమ్ముబూరలు ఊదారు. ప్రత్యేక డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, హిజ్రాల శివాలుతో సారలమ్మ ఆలయం భక్తితో ఉప్పొంగింది. సారలమ్మ నేరుగా గద్దెలపైకి కాకుండా మేడారంలోని సమ్మక్క పూజా మందిరానికి చేరుకుంది. అప్పటికే అక్కడికి గోవిందరాజు, పగిడిద్దరాజులు చేరుకున్నారు. పూజారులంతా కలిసి పూజలు చేసి కట్టు వేసిన అనంతరం సారలమ్మను గద్దెపైకి చేర్చారు. మంత్రి, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు అమ్మవారికి స్వాగతం పలికారు. సోలం వెంకటేశ్వర్లు పట్టిన హనుమంతుడి జెండా నీడలో కన్నెపల్లి వెన్నెలమ్మ గద్దెపైకి చేరింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో అధికారులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ పర్యవేక్షణలో రోప్‌పార్టీ సిబ్బంది, సీఆర్పీఎఫ్ పోలీసులు తాడు వలయంతో భద్రత కల్పించారు.


కరెంటు పోవడంతో అంధకారంలో భక్తులు

## అంధకారం.. ఆగమాగం..

**20నిమిషాల పాటు కరెంట్ కట్.. తీవ్ర ఇబ్బందులు పడ్డ భక్తజనం**

ఏటూరునాగారం/తాడ్వాయి, ఫిబ్రవరి 21 : మేడారంలోని జంపన్నవాగు ప్రాంతంలో బుధవారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారు 20 నిమిషాల పాటు జంపన్న వాగు నుంచి కన్నెపల్లి మూలమలుపు వద్ద గల స్తూపం వరకు పూర్తిగా అంధకారమైంది. కరెంటు పోవడంతో ఒక్కసారిగా వ్యాపారులు, భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రోడ్డుపై లక్షలాదిగా ఉన్న భక్తులు ముందు ఏమీ కనిపించక చాలా ఇబ్బందులు పడ్డారు. దీంతో తమవారు ఎక్కడున్నారో కూడా కనిపించక ఆందోళన చెందారు. చిన్నా పెద్దా అంతా ఆగమాగం అయ్యారు. కరెంటు పోవడంతో స్నానఘట్టాలపై ఉన్న బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ నుంచి నీళ్లు రాలేదు. దీంతో వేలాది మంది స్నానాలు సమయంలో మధ్యలోనే ఆగిపోవడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వేలాది దుకాణాలు, చీకటి అలుముకుంది. వ్యాపారులు ఆందోళన చెందారు. అదీగాక దొంగలు భయం అందరినీ కలచివేసింది. కరెంటు ఎందుకు పోయిందో తెలియక సెక్టార్ అధికారులు, పోలీసులు వైర్‌లెస్ సెట్లు, ఫోన్లలో మొరపెట్టుకున్నారు. కరెంటు పోవడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 20నిమిషాల తర్వాత కరెంటు పునరుద్ధరించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


సంప్రదాయ నృత్యాలు చేస్తున్న ఆదివాసీలు

